


పెరిగిన పత్తి ధర

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 27: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధర స్వల్పంగా పెరిగింది. మంగళవారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,899 పలికింది. గత వారంతో పోల్చితే పత్తి ధర క్వింటాకు రూ.250పైగా ధర పెరిగింది. ధరలు పుంజుకోవడంతో పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ పంట చేతికొచ్చేలోపు ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. మార్కెట్‌కు 543 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.4,159, గరిష్ఠ ధర రూ.7,899, మధ్యస్థ ధర రూ.7,467గా పలికింది.

ఇక ఉచిత ఇసుక



కర్నూలు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఉచిత ఇసుక అమలుకు శ్రీకారం చుట్టారు. నేటి నుంచి బుకింగ్ కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. కర్నూలులోని రైల్వేస్టేషన్ దగ్గరున్న మైనింగ్ డీడీ ఆఫీసు, సీ. బెళగల్ తహసీల్దార్ కార్యాలయాల్లో బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ వినియోగదారులు బుకింగ్ చేసుకునే ఇసుకను గురువారం నుంచి సింగవరం, ఈర్లదిన్నె, కొత్తకోట రీచుల్లో సరఫరా చేస్తారు. అయితే.. గత వైసీపీలో ఇసుక రవాణా సబ్ కాంట్రాక్టరు నిర్వహించిన వైసీపీ నాయకుడు ఒకరు టిప్పరు యజమానులను సిండికేట్ చేసి అధిక ధరలకు అమ్మేందుకు ఎత్తులు వేస్తున్నారు. అదే జరిగితే.. టీడీపీ కూటమి ప్రభుత్వానికి అప్రతిష్ఠ వచ్చే అవకాశం ఉంది. దీనిపై జిల్లా యంత్రాంగం నిఘా ఉంచాలి.

- నేటి నుంచి బుకింగ్ ప్రారంభం
- కర్నూలు మైనింగ్ డీడీ, సి. బెళగల్ తహసీల్దార్ ఆఫీసుల్లో కేంద్రాలు
- 11 నుంచి ఆన్‌లైన్ విధానం
- ఈర్లదిన్నె, కొత్తకోట, సింగవరం రీచుల్లో ప్రారంభం
- కర్నూలుకు ఇసుక చేరితే టిప్పరుపై రూ.4,500లకు ఆదా

● జిల్లాలో సి. బెళగల్ మండలం, ఈర్లదిన్నె, కొత్తకోట, సింగవరం, పల్‌దొడ్డి, ముడుమాల గ్రామాల వద్ద తుంగభద్ర నదిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు చేసే ఓపెన్ రీచులు ఉన్నాయి. ఇక్కడ 3.87 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే కౌతాళం మండలం గుడికంబాలి, మరళి వద్ద ఓపెన్ రీచ్‌లు ఉన్నాయి. ఇక్కడ తుంగభద్ర నదిలో 3.39 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. తుంగభద్ర వరద ఉన్నందున ఇసుక తవ్వకాలకు అవకాశం లేదు. అయితే పర్యావరణ అనుమతుల కోసం ఈ నెల 31న ప్రజాభిప్రాయ సేకరిస్తారు. ఈసి అనుమతులు రాగానే సెప్టెంబరు 15 నుంచి ఇసుక తవ్వకాలు, రవాణాకు అనుమతి ఇస్తారు.

నేటి నుంచి ఉచిత ఇసుక బుకింగ్ ప్రారంభం

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక పాలసీ పేరుతో వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుక అమ్మకాలు చేశారు. దీంతో ఇసుక వినియోగదారులు అవస్థలు పడ్డారు. సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే ఉచిత ఇసుక అమలుకు శ్రీకారం చుట్టారు. అయితే.. అమలులో స్వల్ప తేడాలు రావడంతో వాటిని లోపాలు సవరించి నేటి నుంచి పూర్తి స్థాయిలో అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగానే కర్నూలు రైల్వేస్టేషన్ సమీపంలోని మైనింగ్ శాఖ డీడీ కార్యాలయం, సి. బెళగల్ మండల తహసీల్దార్ కార్యాలయాల్లో బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి బుకింగ్ ప్రారంభిస్తున్నారు. ఇందు కోసం మంగళవారం మైనింగ్ డీడీ రాజశేఖర్ శిక్షణ ఇచ్చారు. తొలి విడతలో సింగవరం, కొత్తకోట, ఈర్లదిన్నె డీసిల్టింగ్ రీచులలో మరబోట్ల ద్వారా ఇసుక తవ్వకాలు చేపట్టి సరఫరాకు శ్రీకారం చుడుతున్నారు.

టిప్పరుపై రూ.4,500 ఆదా

గత వైసీపీ ప్రభుత్వంలో డీసిల్టింగ్ రీచుల్లో టన్ను రూ.625 ధర ఉండేది. సింగవరం, కొత్తకోట, ఈర్లదిన్నె నుంచి కర్నూలు నగరానికి ఇసుక చేర్చాలంటే 50 కి.మీల రవాణా అవుతుంది. దీంతో గతంలో టన్ను ఇసుక రూ.950 నుంచి రూ.1,150లకు పైగా విక్రయించే వారు. 18 టన్నుల ఇసుక టిప్పరు గతంలో రూ.17 నుంచి రూ.20వేలకు పైగా విక్రయించే వారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక పాలసీని అమలులోకి తెచ్చింది. రాయల్టీ, జీఎస్టీ, నదిలో నుంచి ఇసుక వడ్డుకు చేర్చేందుకు టన్నుకు రూ.326 ప్రకారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ ధర నిర్ణయించింది. అలాగే 20 కి.మీల వరకు ఆరు టైర్ల లారీకి (10 టన్నులు) రూ.2వేలు, 10 టైర్ల లారీ (18 టన్నుల)కు రూ.3,600, 12 టైర్ల లారీ (22 టన్నులు)కి రూ.3,820, 16 టైర్ల లారీ (31 టన్నులు)కి రూ.4,480 రవాణా చార్జీలు నిర్ణయించారు. ఆ పైన కి.మీకు టన్నుకు రూ.8ల ప్రకారం అదనంగా వసూలు చేయవచ్చు. ఈ లెక్కన తుంగభద్ర నది ఇసుక రీచుల నుంచి కర్నూలు నగరానికి 50 కి.మీలకు పైగా అవుతుంది. జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయించిన రవాణా చార్జీల ప్రకారం 18 టన్నుల ఇసుక లారీ రూ.13,780లకే వస్తుంది. గత ప్రభుత్వంలో రూ.18 నుంచి 20వేల దాకా వసూలు చేసే వారు. ఈ లెక్కన ఒక టిప్పరుకు రూ.4,500 వరకు వినియోగదారునికి ఆదా అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అదే 31 టన్నులు 16 టైర్ల లారీకి రూ.10 నుంచి 11 వేలు ఆదా అవుతుంది. ఈ ప్రక్రియలో ప్రభుత్వం ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఉచితంగా ఇసుక ఇస్తున్నది.


ఇసుకడంప్


సి.బెళగల్ మండలంలో డిసిల్టింగ్ ద్వారా ఇసుక తవ్వకం

రంగంలోకి ఇసుక సిండికేట్లు

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక రవాణా సబ్ కాంట్రాక్టరు నిర్వహించిన కర్నూలు నగరానికి చెందిన వైసీపీ కీలక నాయకుడు ఒకరు ఇసుక టిప్పర్ల యజమానులను సిండికేట్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నగరంలో 126 టిప్పర్ల దాకా ఉన్నాయి. అత్యధికంగా 18, 22 టన్నుల రవాణా సామర్థ్యం కలిగిన టిప్పర్లే ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన రవాణా చార్జీల ప్రకారం 18 టన్నుల ఇసుక టిప్పరు రూ.13,788, 22 టన్నుల టిప్పరు రూ.16,292లకు మించి ఉండదు. దీంతో గత ప్రభుత్వంలో ఇసుక రవాణాలో చక్రం తిప్పిన వైసీపీ నాయకుడు రంగప్రవేశం చేసి టిప్పరు యజమానులను సిండికేట్ చేయడంతో పాటు కృత్రిమ కొరతను సృష్టించి 18 టన్నుల టిప్పరు రూ.18వేలు, 22 టన్నుల టిప్పరు రూ.22 నుంచి రూ.25వేలకు అమ్మేందుకు ఎత్తులు వేస్తున్నారు. తద్వారా టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాల్జేసేందుకు తెర వెనుక కుట్ర చేస్తున్నట్లు సమాచారం. దీనిని జిల్లా యంత్రాంగం అడ్డుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈర్లదిన్నె, కొత్తకోట, సింగవరం రీచుల నుంచి 0 నుంచి 20 కి.మీల వరకు ఇసుక రవాణా చార్జీలు వివరాలు ఇలా: (రూ.లలో)

టిప్పరు/టన్నులు	ప్రస్తుతం	వైసీపీ ప్రభుత్వంలో	తేడా
ట్రాక్టరు/4.5	2,867	4,212	1345
ఆరు టైర్ల లారీ/10	5,260	8,250	2,990
పది టైర్ల టిప్పరు/18	9,468	14,850	5,382
12 టైర్ల టిప్పరు/22	11,012	17,590	6,578
16 టైర్ల టిప్పరు/31	14,586	23,855	9,269


ఈర్లదిన్నెలో యంత్రాల ద్వారా ఇసుక తవ్వకం

నేటి నుంచి ఇసుక బుకింగ్ ప్రారంభం



నేటి నుంచి ఇసుక బుకింగ్‌కు శ్రీకారం చుడుతున్నాం. కర్నూలు రైల్వేస్టేషన్ సమీపంలోని మైనింగ్ డీడీ ఆఫీసు, సి. బెళగల్ మండల తహసీల్దార్ కార్యాలయాల్లో బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాము. బుకింగ్ చేసుకున్న వారికి గురువారం నుంచి ఇసుక సరఫరా చేస్తాం. ఇసుక కావల్సిన వినియోగదారులు ఆధార్ కార్డు, లారీ/టిప్పరు నెంబర్లు, డ్రైవర్ వివరాలతో రావాలి. ప్రస్తుతం సింగవరం, కొత్తకోట, ఈర్లదిన్నె రీచుల్లో ఇసుక సరఫరా చేస్తాం. రెండు రోజుల తర్వాత పల్‌దొడ్డి, ముడుమాల ఇసుక రీచులు కూడా మొదలవుతాయి. పర్యావరణ అనుమతులు వచ్చాక సెప్టెంబరు, అక్టోబరులో గుడికంబాలి, మరళి, నదిచాగి ఓపెన్ రీచుల నుంచి సరఫరా చేపడుతాం.

- రాజశేఖర్,
మైనింగ్ డీడీ, కర్నూలు

శ్రీమఠం హుండీ ఆదాయం
రూ.3.23 కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మంత్రాలయం, ఆగస్టు 27: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,23,44,480 నగదు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి తెలిపారు. మంగళవారం జూలై 2 రోజులతో పాటు ఆగస్టు 27 రోజులకు సంబంధించిన 29 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమరాల నిఘా మధ్య లెక్కించినట్లు తెలిపారు. రూ.3,23,44,480 నగదుతో పాటు 1.273 కిలోల వెండి, 156 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు.

జడ్పీలో బదిలీలకు రిక్వెస్ట్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 27: జిల్లా పరిషత్ పరిధిలోని వివిధ విభాగాలలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు 232 మంది ఐదేళ్ల పూర్తి చేసుకున్నారని, వీరిలో 178 మంది బదిలీలకు రిక్వెస్ట్ పెట్టుకున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ-9, పరిపాలన అధికారులు-20, సీనియర్ అసిస్టెంట్లు-35, జూనియర్ అసిస్టెంట్-52, టైపిస్టు-10, రికార్డు అసిస్టెంట్లు-22, లైబ్రరీ అసిస్టెంట్లు-14, ల్యాబ్ అసిస్టెంట్లు-10, నాల్గవ తరగతి ఉద్యోగులు-51, స్వీపర్స్-8, వాచ్‌మెన్-1 ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అన్ని క్యాడర్లకు సుమారు 178 మంది బదిలీల కోసం రిక్వెస్ట్ పెట్టుకున్నట్లు సీఈఓ తెలిపారు. అసోసియేషన్‌లో సభ్యులుగా ఉంటే మినహాయింపు ఇవ్వాలని ఉందని ఆయన పేర్కొన్నారు.

జగన్‌ను తక్షణమే అరెస్టు చేయాలి
- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి



కర్నూలు(అర్బన్), ఆగస్టు 27: రూ. లక్షల కోట్లు దోచేసి బెయిల్‌పై బయట ఉన్న జగన్‌ను తక్షణమే అరెస్టు చేసి జైలుకు పంపాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాష్ట్రాన్ని సమూలంగా దోచుకుని సీబీఐ కేసుల్లో అరెస్టు అయిన జగన్ బెయిల్‌పై తిరుగుతున్నాడని, వెంటనే సీబీఐ స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఆర్థిక ఉగ్రవాది ప్రజల మధ్యలో ఉంటే మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం తీరిక లేకుండా కష్టపడుతున్న చంద్రబాబుపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఎమ్మిగనూరు అభివృద్ధికి ప్రాధాన్యం

- బనవాసిలో మెగా టెక్స్‌టైల్ పార్కు
- సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే బీవీ

కర్నూలు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు, ప్రాజెక్టులు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మంగళవారం సీఎం చంద్రబాబును కలిశారు. దాదాపు 25 నిమిషాలు సీఎం చంద్రబాబుతో ఎమ్మిగనూరు నియోజకవర్గంలో చేపట్టాల్సిన వివిధ ప్రాజెక్టులపై చర్చించారు. బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో దాదాపు 3,500 ఎకరాల భూములు ఉన్నాయనీ సీఎం


సీఎం చంద్రబాబుకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బీవీ

చంద్రబాబుకు వివరించారు. చేనేతల అభివృద్ధి కోసం మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బనవాసి పశుక్షేత్రంలో నేషనల్ అనిమల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం సెంటరు ఏర్పాటుతో పాటు వైరల్ వ్యాక్సిన్ ప్రొడక్షన్ యూనిట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం 100-150 ఎకరాల భూమి అవసరం ఉంది. పీ-3, పీ-4 మోడల్‌లో నిర్మాణం చేపట్టే ఈ యూనిట్ కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని సీఎం స్పష్టమైన హామీ ఇచ్చారు. అదే క్రమంలో ఎమ్మిగనూరు-కర్నూలు నాలుగు లైన్ల జాతీయ రహదారి, మంత్రాలయం, కర్నూలు వయా ఎమ్మిగనూరు రైల్వేలైన్ ప్రాజెక్టులపై కూడా సీఎం బాబు దృష్టికి బీవీ తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అదే క్రమంలో గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు కేటాయించాలని, అసంపూర్తిగా ఆగిపోయిన ఆర్డీఎస్ కుడి కాలువ పనులు, గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం పెంపు పనులకు నిధులు కేటాయించి ఆ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే బీవీ సీఎం చంద్రబాబుకు వివరించారు. త్వరలోనే గురు రాఘవేంద్ర ప్రాజెక్టు మరమ్మతులు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ ప్రతిపాదనలపై కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్తానని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పోలీసులపై ఫిర్యాదులు వస్తున్నాయ్... జాగ్రత్త..!

- నగరంలో ప్రాపర్టీ కేసులు పెండింగ్‌లో అధికమవుతున్నాయి
- ప్రతి కేసుపై అవగాహన ఉండాల్సిందే
- నేరాల నియంత్రణకు కృషి చేయాలి
- చోరీ అయిన ప్రాపర్టీని రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు, ఆగస్టు 27: వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని, మరోసారి ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తే చర్యలు ఉంటాయని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీఐలు, ఎస్‌ఐలతో నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లలో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ల వారిగా కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు, న్యాయశాఖలు కలిసి కోర్టులో పెండింగ్ ఉన్న కేసుల దర్యాప్తులను త్వరితగతిన పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సలహాలు సూచనలు చేశారు. ఇప్పటి నుంచే ప్రాపర్టీ రికవరీలు పెంచాలని అన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే వచ్చే నెల నేర సమీక్ష సమావేశంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్లును ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్‌ఐ ఆపై స్థాయి అధికారులు బాధితులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. వినాయక చవితి, దసరా వంటి పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు గస్తీ విజిబుల్ పోలీసింగ్ పెంచాలన్నారు. సైబర్ నేరాల బారిన పడిన బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. సీసీటీఎన్‌ఎస్‌లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు.

● ఆదోని సబ్ డివిజన్ పరిధిలో కేసుల పురోగతి గురించి ఆరా తీశారు. సీఐ శ్రీరామ్ కేసుల వివరాలు చెప్పడంలో తడబడుతుంటే.. అసహనం వ్యక్తం చేశారు. కర్నూలు నగరంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కొన్ని కేసుల్లో మాత్రమే చార్జ్‌షీటు ఫైల్ చేశారని, మిగతా కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయంటూ ప్రశ్నించారు.


మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

ప్రతిభ కనబరిచిన పోలీసులకు అభినందనలు:

గాజులదిన్నె చెరువులో ఐరన్‌బండ, గంజిహల్లి గ్రామ రైతులు చెరువు నీటిలో చిక్కుకున్న 32 మంది ప్రాణాలు కాపాడిన గోనెగండ్ల పోలీసులు సీఐ ఏ.గంగాధర్, హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీరాములు, కానిస్టేబుళ్ల బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కర్నూలులో గంజాయి అమ్మేవారిని పట్టుకుని జైలుకు పంపినందుకు త్రీటౌన్ ఎస్‌ఐ మన్మథ విజయన్‌ను అభినందించారు. గూడూరుకు చెందిన బంగారు వ్యాపారి వెంకటేశ్వర్లు కిడ్నాప్ కేసును ఛేదించినందుకు సహకరించిన (అప్పట్లో నాగులాపురం ఎస్‌ఐ) ప్రస్తుతం కోడుమూరు ఎస్‌ఐ ఏపీ శ్రీనివాసులు కృషిని అభినందించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డీఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసాచారి, వెంకట్రామయ్య, సోమన్న, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.


సమీక్షకు హాజరైన పోలీస్ అధికారులు

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.1.6 కోట్లు


హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం ఆగస్టు 27: మండలంలో ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో శ్రావణ మాసపు ఉత్సవాల సందర్భంగా నాలుగో సోమవారం భక్తులు సమర్పించిన కానుకలను దేవస్థానపు కాలక్షేపపు మండపంలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం కొనసాగినది. నగదు రూపంలో రూ.1,00,09,030, అన్నదానం హుండీ రూ.6,68,500 మొత్తం నగదు రూ.1,06,77,530, బంగారం 8గ్రాములు, వెండి 22 కిలోల 400గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల అధికారి పాండురంగారెడ్డి, హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేశ్, ఏపీజీబీ బ్యాంకు సిబ్బంది, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానపు సిబ్బంది పాల్గొన్నారు.

కిమ్స్ హాస్పిటల్‌కు ఎన్టీఆర్ వైద్యసేవ నోటీసులు

- రోగి నుంచి ఎలా డబ్బులు చేస్తారు..?
- జిల్లా కో ఆర్డినేటర్ డా. భాస్కర్ రెడ్డి


విచారణ చేస్తున్న ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 27: కిమ్స్‌లో వైద్యం పేరుతో రూ.4 లక్షలు వసూలు చేసి కూడా సరిగా వైద్యం చేయకపోవడతో బాలిక చనిపోయిందనే వార్తకు డా. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డా.భాస్కర్ రెడ్డి స్పందించి నోటీసులు ఇచ్చారు. మంగళవారం ఆయన కిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లి తనిఖీ చేశారు. డా.ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు ఉన్న బాలికకు దాని కింద ఎందుకు చికిత్స అందించలేదని, కిమ్స్ హాస్పిటల్ వైద్యులను ప్రశ్నించారు. డెంగీ వ్యాధి ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఉన్నా ఎందుకు రోగి తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేశారని మండిపడ్డారు. జరిగిన ఘటనపై డా. భాస్కర్ రెడ్డి కిమ్స్ హాస్పిటల్‌లో విచారణ చేశారు. చనిపోయిన బాలిక కావేరీ కేషీట్‌ను ఆయన స్వాధీనం చేసుకు న్నారు. ఈ విషయాన్ని డా.ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు అధికారులకు తెలియజేసి కిమ్స్ హాస్పిటల్ సీవోవోకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 24 గంటల్లో ఈ కేసుకు సంబంధించిన వివరాలు అందజేయాలని అందులో పేర్కొన్నారు.

ఇసుక ప్రతి కుటుంబానికి చేరాలి

వీఆర్‌వోలకు బుకింగ్ విధానం అవగాహన


వీఆర్‌వోలకు అవగాహన కల్పిస్తున్న గనుల శాఖ డీడీ

కర్నూలు(అర్బన్), ఆగస్టు 27: ఇసుక అవసరమైన ప్రతి కుటుంబానికి అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం నగరంలోని గనుల శాఖ కార్యాలయంలో వీఆర్‌వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుకింగ్ చేసుకున్న ప్రతి ఒక్కరికి ఇసుక సరఫరా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని, అందుకు వీఆర్‌వోలు తమ వంతు బాధ్యతతో పని చేయాలని సూచించారు. కర్నూలు గనుల శాఖ, కార్యాలయంలో తోపాటు సీ బెళగళ్ మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రాల నుంచి మాత్రమే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 3.87 లక్షల టన్నుల ఇసుక సిద్ధంగా ఉందని, టన్ను ఇసుక రూ. 326 ధర నిర్ణయించారని తెలిపారు.

మంత్రాలయంలో ఉత్సాహంగా ఉట్టి వేడుకలు


మధ్వమార్గ్ కారిడార్‌లో ఉట్టి కొడుతున్న సంస్కృత పాఠశాల విద్యార్థులు

మంత్రాలయం, ఆగస్టు 27: మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం మధ్వమార్గ్ కారిడార్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఘనంగా జరుపుకున్నారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు, వ్యాసరాజమఠం విద్యామనోహర తీర్థులు, బాలాఘర్ మఠం అక్షోభ్యరామప్రియతీర్థులు ఉట్టి వేడుకలను వీక్షించారు. భక్తి శ్రద్ధలతో రంగు నీళ్లు చల్లుకుంటూ గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉట్టి కొట్టారు. విద్యార్థులకు శ్రీమఠాల పీఠాధిపతులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణారావు, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు వెంకటేశ్ జోషి, ఐపీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

2న పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 27: కర్నూలు మెడికల్ కాలేజీలో పారా మెడికల్ కోర్సులు 2024-25 సంవత్సరానికి అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సెప్టెంబరు 2న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. హరిచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో కౌన్సిలింగ్ ఉంటుందని, కౌన్సిలింగ్‌కు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలని, ఇంటర్ బైపీపీ విద్యార్థులకు మొదట ప్రాధాన్యత ఉంటుందన్నారు. మార్కులు, రోస్టర్ ఆధారంగా అర్హులైన వారికి సీట్లు కేటాయించబడుతాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తెలిపారు.

కుందూ నదిలో గుర్తు తెలియని శవం

దొర్నిపాడు, ఆగస్టు 27: మండలంలోని క్రిష్టిపాడు గ్రామ శివారులో కుందూనదిలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఏఎస్ఐ రంగయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కుందూనదిలో దాదాపు 45 ఏళ్ల వయసు గల మహిళ శవం కొట్టుక రావడంతో వీఆర్వో సాంబశివరావు ఫిర్యాదు చేశారని తెలిపారు. శవానికి తల వెంట్రుకలు పూర్తిగా వెంట్రుకలు లేవని అన్నారు. వారం రోజుల కిందట మృతి చెంది ఉండవచ్చని ఏఎస్ఐ వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీకి కమిషనర్ లేఖ

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 27: నగర పాలక సంస్థ పరిధిలో 15 వాహనాలకు ఇన్సూరెన్స్ రూ.3లక్షలు ఎక్కువ కట్టామని కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజర్‌కు లేఖ రాశాడు. 15 వాహనాలకు రూ.4 లక్షలు కట్టాల్సి ఉండగా.. రూ.7 లక్షలు కట్టారని, రూ.3 లక్షలు తిరిగి ఇవ్వాలని కోరుతూ ఇన్సూరెన్స్ కంపెనీకి లేఖను పంపారు.

- సెప్టెంబరు 24న లోకాయుక్తలో హాజరు కావాలి: నగర పాలక సంస్థకు సంబంధించి లెటర్.నెంబర్.2310/2023/బి1/లోక్/3977/2024 తేదీ-06.04.2024 సంబంధించి నగర పాలక సంస్థ కమిషనర్ సెప్టెంబరు 24న లోకాయుక్తలో హాజరు కావాలని జడ్జీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు లోకాయుక్త నుంచి సమన్లు రావడంతో కమిషనర్ దానికి సంబంధించిన వివరాలను సేకరించి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె, ఆగస్టు 27: బనగానపల్లె మండలం నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందివర్గం గ్రామానికి చెందిన ఉగ్గు దస్తగిరి కుమారుడు సంజీవరాయుడు (32) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. గతంలో సంజీవరాయుడు ప్రమాదానికి గురైన రాల బలహీనతకు గురయ్యారు. దీనికితోడు మానసిక స్థితి సరిగా మనస్తాపానికి గురై ఇంట్లోనే పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి దస్తగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొలాల్లోకి మురుగు

- గ్రామంలోని డ్రైనేజీ నీరంతా పంటల్లోకి
- 20 ఏళ్లుగా రైతుల ఆందోళన.. ఫిర్యాదులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


లొద్దిపల్లె గ్రామంలో ప్రవహించే ప్రధాన మురికి కాలువ


పంట పొలాల మధ్య ప్రవహించే ప్రధాన మురికి కాలువ

కర్నూలు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె గ్రామంలో జనాభా 4 వేలు పైమాటే. ఆ గ్రామంలోని మురుగునీరు వెళ్లేందుకు ప్రధాన డ్రైనేజీ లేదు. ఊళ్లో మురుగంతా సమీప పొలాల్లోకి వదిలేస్తున్నారు. ఒక రోజు కాదు.. రెండు రోజులు కాదు. దాదాపుగా 20 ఏళ్లుగా పల్లెలోని డ్రైనేజీల నీరంతా పంట పొలాల్లోకి వదలడంతో సాగు చేసుకోలేని దుర్భర పరిస్థితి అని రైతులు అంటున్నారు. ముగరునీరంతా పొలాల్లోకి చేరడంతో టీచర్ వెంకట్రామిరెడ్డి, కమ్మ తిమ్మారెడ్డి, సుదర్శన్‌బాబు, డ్రైవర్ వెంకటేశ్వర్లు, కమ్మ రాజశేఖర్, చంద్రశేఖర్, కురువ పెద్దయ్య, టైమూరు బాషా, పెద్దబాషా, ఎస్.చందు తదితర రైతుల 30 ఏకరాలకు పైగా పొలాలు మురుగునీరు పంట సాగుకు పనికి రాకుండా పాడైపోతున్నాయని వాపోతున్నారు. డ్రైనేజీకి అడ్డుకట్ట వేస్తే గ్రామంలోని వీధుల్లో మురుగునీరు చేరిపోయి వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో మానవత్వంతో ఆ పని చేయడం లేదని రైతు కమ్మ రాజశేఖర్ వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కలెక్టరు, వ్యవసాయ అధికారులు, మండల అధికారులకు ఫిర్యాదులు చేస్తే.. క్షేత్రస్థాయిలో పరిశీలించి మురుగునీటి రైతులు నష్టపోతున్న మాట నిజమే అని, 400 మీటర్లు పక్కా డ్రైనేజీ నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని తేలింది. దీనికి రూ.13.50 లక్షలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ ప్రతిపాదనలు రూ.20, 30 లక్షలకు చేరిందే తప్ప నిధులు ఇవ్వలేదు. పనులు చేపట్టలేదు. రైతులకు మాత్రం కన్నీళ్లు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తమ గోడు ఆలకించి పక్కా డ్రైనేజీ నిర్మించి పొలాలను కాపాడాలని విన్నవిస్తున్నారు.

మా గోడు పట్టించుకోవడం లేదు



మా ఊరిలోని మురుగంతా పొలాల్లోకి వస్తున్నది. అడ్డుకట్ట వేస్తే ఊరంతా మురుగు చేరి వ్యాధులు ప్రబలుతాయి. అందుకని ఆ పని చేయడం లేదు. 20 ఏళ్లగా ఇబ్బందులు పడుతున్నాం. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులకు ఫిర్యాదులు చేస్తే పరిశీలించి పక్కా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.13.50 లక్షలతో అంచనా వేశారు. నిధులు మాత్రం ఇవ్వలేదు. ఇప్పుడు రూ.30 లక్షలకు చేరింది. గత వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళితే న్యాయం చేస్తానని చెప్పాడే తప్ప పట్టించుకోలేదు.

- కమ్మ రాజశేఖర్, రైతు, లొద్దిపల్లె, ఓర్వకల్లు మండలం

మురుగంతా పొలాల్లోకే



వర్షపు నీరు పొలాల్లోకి వెళ్తుందంటే ఎవరూ అభ్యంతరం చెప్పరు. గ్రామంలోని మురుగునీరంతా పంట పొలాల్లోకి వదిలేశారు. చేలు పాడైపోతున్నాయి. రైతు గోడు రాజకీయ నాయకులు పట్టించుకోవడం లేదు.

- తైమూర్ బాష, లొద్దిపల్లె గ్రామం

పంట సాగు చేయలేని పరిస్థితి



మా గ్రామం పక్కనే నాకు 6.30 ఎకరాలు పొలం ఉంది. ఊర్లోని మురుగునీరంతా మా పొలాల్లోకి వస్తుంది. పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. కౌలుకు ఇద్దామన్నా ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రధాన రోడ్డు పక్కనే 400 మీటర్ల వరకు పక్కా డ్రైనేజీ నిర్మిస్తే మా కష్టాలు తీరుతాయి.

- సి. చంద్రశేఖర్, లొద్దిపల్లె గ్రామం

అధికారులనే ఏమార్చిన ఘనుడు..!

- తప్పుడు వివరాలతో ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం
- విచారణ చేయకుండానే మంజూరు చేసిన అధికారులు
- తప్పు తెలుసుకుని.. చర్యలకు ఆదేశం


కౌతాళం తహసీల్దార్ కార్యాలయం

కౌతాళం, ఆగస్టు 27: ఏదైనా ధ్రువీకరణ పత్రం పొందాలంటే అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పనికావడం కష్టం. కానీ కౌతాళం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ఎలాంటి విచారణ చేపట్టకుండా కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. ఆ తర్వాత తమ తప్పులు తెలుసుకుని అధికారులు అప్రమత్తమై మంజూరు చేసిన పత్రాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తహసీల్దార్ మల్లికార్జున స్వామి తెలిపిన వివరాల మేరకు కర్నూలుకు చెందిన నల్లగోడి శ్రీనివాసులు తప్పుడు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రంతో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం పొందాడు. శ్రీనివాసులు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం పొందాడని జిల్లా అధికారులకు కొందరు ఫిర్యాదు చేయడంతో అతడిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. రెండు నెలల్లో అసలైన కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలని గడువు ఇచ్చారు. దీంతో ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం తిరిగి పొందాలన్న ఆలోచనతో తన ఆధార్ కార్డులో మండల పరిధిలోని బదినేహల్ గ్రామ వాసిగా తప్పుడు కార్డును సృష్టించి దాని ఆధారంగా కౌతాళం తహసీల్దార్ కార్యాలయంలో ఎస్టీ సరిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సదరు దరఖాస్తును గ్రామ వీఆర్వో సూర్యనారాయణ రెడ్డి విచారించకుండా సంతకం చేసి తహసీల్దార్‌కు పంపించాడు. వీఆర్వో సంతకంతో తహసీల్దార్ కూడా శ్రీనివాసులుకు ఎరుకలి కులం సర్టిఫికెట్‌ను మంజూరు చేశాడు. ఎస్టీ సర్టిఫికెట్‌ను శ్రీనివాసులు మరో రెండు రోజుల్లో ఉన్నతాధికారులకు సమర్పించాల్సి ఉండగా అనుమానం వచ్చిన వీఆర్వో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సదరు వ్యక్తిపై గ్రామంలో విచారించగా అలాంటి పేరు గల వ్యక్తి ఆ గ్రామంలో లేడని తెలిసింది. రెవెన్యూ అధికారులు వెంటనే శ్రీనివాసులును ఫోన్‌లో సంప్రదించి తమ వద్దకు రప్పించుకుని అతను పొందిన కుల ధ్రువీకరణ పత్రాన్ని స్వాధీనం చేసుకుని ఆధార్‌కార్డును ఎలా సృష్టించావని ఆరా తీశారు. దీంతో ఆయన తాను చేసిన మోసం ఒప్పుకుని అధికారులను క్షమించమని ప్రాధేయపడ్డాడు. ఈ విషయంపై తహసీల్దార్ మల్లికార్జున స్వామిని వివరణ కోరగా.. శ్రీనివాసులు తప్పుడు ఆధార్‌కార్డు చిరునామాతో అధికారుల నుంచి కుల ధ్రువీకరణ పత్రం పొందాడని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నాడు. అదేవిధంగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గ్రామ వీఆర్వోపై కలెక్టర్‌కు నివేదిక పంపుతానని తెలిపారు.

దేవుడి ఆస్తులను కబ్జా చేస్తారా...?

- ఉమ్మడి జిల్లాలో కబ్జాలపై విచారణ ఆరంభం
- కబ్జారాయుళ్లకు కాటసాని ప్రిన్సిపాల్
- సజ్జల అండతో రెచ్చిపోయి దోచేశారు
- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఫైర్



కర్నూలు(అర్బన్), ఆగస్టు 27: వైసీపీ పాలనలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో సజ్జల అండతో కబ్జా రాయుళ్లు వైసీపీ నేత కాటసాని రాంభూపాల్‌రెడ్డి డైరెక్షన్‌లో రూ.కోట్లు విలువ చేసే వేలాది ఎకరాల భూములు కబ్జా చేశారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఆరోపించారు. మంగళవారం నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలోని బైరెడ్డి కాంప్లెక్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవుడి భూములు దేవుడికే దక్కేలా పోరాటం చేస్తామన్నారు. అమెరికాలో నివసిస్తున్న వ్యక్తి కర్నూలు మండలం పసుపల గ్రామంలోని సర్వే నెంబర్ 608-2 వీరభద్ర స్వామి ఆలయ మాన్యం భూమికి ఎన్‌వోసీ కావాలని దరఖాస్తు చేసుకున్నాడంటే కబ్జాలు ఎంత వరకు చేరాయో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఉమ్మడి జిల్లాలో కబ్జా రాయుళ్లకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రిన్సిపాల్‌గా వ్యవహిస్తూ పెంచి పోషించాడని, అనుచరులంతా బిల్డర్ల అవతారం ఎత్తి దేవుడి భూములు, వక్ఫ్ భూములు, అటవీ భూములు, వాగులు, వంకలు, పోరంబోకు స్థలాలన్నీ కబ్జా చేశారని ఆరోపించారు. అంతేగాక వాటన్నిటికీ రికార్డులు కూడా తయారు చేయించారని, వాటిని తయారు చేసిన రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులను కూడా సస్పెండ్ చేయాలని కోరారు. కాటసాని అనుచరులు నగర శివారులోని జగనాథ గట్టుపై ఉన్న ఆలయానికి చెందిన 79 ఎకరాల భూమిని కబ్జా చేశారనే ఫిర్యాదు రావడంతో ఎంపీ బైరెడ్డి శబరి వెళ్లి వెంటనే పరిశీలించారని, ఆ విషయాన్నిసీఎంకు కూడా ఫిర్యాదు చేశారని అన్నారు.

ఆగిన లారీని ఢీకొన్న మరో లారీ

డ్రైవర్‌కు గాయాలు

చాగలమర్రి, ఆగస్టు 27: చాగలమర్రి గ్రామ సమీపంలోని 40వ జాతీయ రహదారిపై కూలూరు రస్తాలో ఆగిన వాటర్ ట్యాంకర్‌ను ఐచర్ వాహనం ఢీకొన్న సంఘటనలో డ్రైవర్ గాయపడ్డాడు. జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలకు హైవే వాటర్ ట్యాంకర్ నీరు పడుతుండగా హైదరాబాదు నుంచి తిరుపతి వెళ్తున్న సింధూ పార్శిల్ సర్వీస్ ఐచర్ వాహనం వాటర్ ట్యాంకుకు వెనుక వైపు ఢీకొ ట్టింది. దీంతో డ్రైవర్ రఫిద్దిన్ గాయపడ్డాడు. హైవే అంబులెన్స్ సిబ్బం ది సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన రఫిద్దిన్‌ను చికిత్స నిమి త్తం ప్రొద్దుటూరు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. ఈ విష యం తెలుసుకున్న ఏఎస్ఐ నబీసాహెబ్ సంఘటన స్థలానికి చేరుకొని ఢీకొన్న లారీలను పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కిరాణాషాపులో చోరీ

కోవెలకుంట్ల, ఆగస్టు 27: కోవెలకుంట్ల పట్టణంలోని పాండురంగ స్వామి దేవాలయం పక్కనే ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని నాగేంద్రకు చెందిన కిరాణాషాపులో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి షాపులో ఉన్న రూ.1.35 లక్షలు నగదు ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన నాగేంద్ర ప్రతిరోజూ ఉదయం నుండి రాత్రి 8 వరకు కిరాణా షాపు నిర్వహించుకుని తాళం వేసి ఇంటికి వెళ్లేవాడు. అందులో భాగంగా సోమవారం కూడా ఉదయం నుండి రాత్రి వరకు షాపు నిర్వహించుకుని రూ.1.35 లక్షల నగదు షాపులోనే పెట్టి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపు తాళం పగలగొట్టి అందులో ఉన్న రూ.1.35 లక్షలు అపహరించారు. నాగేంద్ర మంగళవారం ఉదయం షాపు వద్ద వచ్చి చూడగా షాపులో నగదు దొంగతనం జరిగినట్టుగా తెలుసుకుని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

కొలిమిగుండ్ల, ఆగస్టు 27 : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని గీతాశ్రమం వద్ద మంగళవారం పేకాట స్థావరంపై దాడి నిర్వహించి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఏఎస్ఐ గోవిందనాయక్ వెల్లడించారు. గ్రామానికి చెందిన వీరిని అదుపులోకి తీసుకొని రూ.3150 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గులాబి రంగు పురుగుతో జాగ్రత్త

పత్తి రైతులకు కేవీకే కోఆర్డినేటర్ సూచన


మాట్లాడుతున్న కేవీకే కో ఆర్డినేటర్ రాఘవేంద్ర చౌదరి

ఎమ్మిగనూరు, ఆగస్టు 27: పత్తిని విత్తిన 45 రోజుల నుంచి గులాబి రంగు పురుగు ఉనికిని గమనిస్తూ ఉండాలని కేవీకే కో.ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్ర చౌదరి రైతులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి కేవీకేలో కేవైఆర్డీ, ఎల్డీసీ సంయుక్తంగా గులాబి రంగు పురుగుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కో.ఆర్డినేటర్ రాఘవేంద్ర చౌదరి మాట్లాడుతూ గులాబి రంగు పురుగు ఉనికిని గమనించి లింగాకర్షణ బుట్టలు అమర్చి వరుసగా మూడు రోజులు బట్టలతో ఎనిమిది తల్లి రెక్క పురుగులు పడిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పత్తి నాణ్యతను పెంచుకోవటానికి ఎల్‌డీసీ సంస్థ గులాబి రంగు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలు పంపిణీ చేస్తున్నారన్నారు. పత్తి పంట జనవరి తరువాత ఎట్టి పరిస్థితుల్లో పొలాల్లో ఉంచకూడదన్నారు. అధిక దిగుబడికోసం అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేయాలన్నారు. అనంతరం 150 మందికి లింగాకర్షణ బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ చందన, డాక్టర్ మోనిక, విష్ణువర్ధన్ రెడ్డి, రవీంద్ర, ఎల్‌డీసీ ప్రతినిధి సంతోష్, గోపి రైతులు పాల్గొన్నారు.

బదిలీలకు 300 దరఖాస్తులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 27: ప్రభుత్వం బదిలీలకు పచ్చజెండా ఊపడంతో ఉద్యోగులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారు రిక్వెస్టుపై బదిలీలు కోరుకునేవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. డీఆర్‌డీఏ శాఖలో 150 మంది, భూసర్వే శాఖలో 150 మంది దరఖాస్తు చేసుకున్నారు.

వసతి గృహాల కన్నా జైలే నయం: ఏఐఎస్ఎఫ్



దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న మునెప్ప

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 27: వసతి గృహాల కన్నా జైలే నయమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీరాములు అన్నారు. మంగళవారం ధర్నా చౌకు వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, కార్యదర్శి ఎస్.షాబీర్ బాషాల ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. దీక్షలనుద్దేశించి వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న కుక్, కామాటి, వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. దీక్షకు ఏఐవైఎఫ్, ఏపీ మహిళా సమాఖ్య, డీహెచ్‌పీఎస్, ఏఐటీయూసీ, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు లలితమ్మ, చంద్రశేఖర్, శ్రీనివాసులు, శ్రీరాములుగౌడు, బీసన్న, శ్రావణి, భారతి పాల్గొని మాట్లాడారు. ఈ దీక్షలో కూర్చున్న వారిలో ఏఐఎస్ఎఫ్ ఆఫీస్ జిల్లా బేరర్స్ విజేంద్ర, రంగస్వామి, శరత్, వీరేష్, దస్తగిరి, శ్రీకాంత్, కోశాధికారి అశోక్, మధు, సాబీర్, వినయ్, కరుణాకర్, హర్ష, చరణ్, మహిళా నాయకులు ప్రియ, సాదియా పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం ఉద్యమిద్దాం

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 27: హక్కుల సాధన కోసం ఉద్యమిద్దామని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఇప్పటి దాకా జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు కమిటీలకు తోడుగా ప్రతి దళితపేటలోను సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అధ్యక్షుడు దేవసహాయం, ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, బి.కరుణాకర్, ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన అవసరం

కర్నూలు(అర్బన్), ఆగస్టు 27: ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన అవసరమని ప్రాజెక్టు మేనేజర్ మునీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై స్ప్రెడ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు నేర్చుకోవాలని కోరారు. ఏఎ న్ఎం పుష్పలతా మాట్లాడుతూ హెచ్ ఐవీ 4 రకాలుగా సంక్రమిస్తుందని, కలుషిత సూదులు, సిరీజీల మార్పిడి, కలుషిత రక్త మార్పిడి, హెచ్ఐవీ సోకిన తల్లి నుంచి బిడ్డకు వస్తుందని చెప్పారు. ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్, అపర్ణా, లక్ష్మి, స్ప్రెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఆగస్టు 27: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా బుధవారం బి.క్యాంప్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని డీ2 డివిజన్ ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. ఈమేరకు బి.క్యాంప్ ఏరియా, సోమప్ప కాలనీ, మహాలక్ష్మీనగర్, అరోరానగర్, టెలికామ్‌నగర్, లెక్చరర్ కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు జాతీయ క్రీడా దినోత్సవం

▸ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని వేడుకలు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 27: హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తారు. కర్నూలు జిల్లాలో క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజేతలకు కలెక్టర్, ఎస్పీ, మంత్రులు సన్మానించి నగదు పురస్కారాలు, జ్ఞాపికలు ఇచ్చి గౌరవిస్తారు. జిల్లాలో వా రం రోజుల పాటు అంతర్‌పాఠశాలల బాలబాలికలకు పోటీలు నిర్వహించి ఈ నెల 29న విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరి స్తామని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి తెలిపారు. అలాగే గత సంవత్సరం డీఎస్‌ఏ స్టేడియంలో మేజర్ ధ్యాన్‌చంద్ కాంస్య విగ్రహం ఆవిష్కరించామని క్రీడల అభివృద్ధి అధికారి తెలిపారు.



హాకీ ఆడుతున్న క్రీడాకారులు

క్రీడాకారులను సత్కరిస్తాం



జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులను ట్రాక్ షూట్, శాలువ, జ్ఞాపికతో సత్కరిస్తాం. హాకీ క్రీడతో పాటు ఇతర క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించి కర్నూలు జిల్లా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి.

\- భూపతిరావు, క్రీడల అభివృద్ధి అధికారి

ధ్యాన్‌చంద్ సేవలు చిరస్మరణీయం



భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రభుత్వం కార్యక్రమాలు ఏర్పాటు చేయడం హర్షణీయం. ఆయన స్ఫూర్తితో జిల్లాలో హాకీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తాం.

\- దాసరి సుధీర్, జిల్లా హాకీ సంఘం కార్యదర్శి

ఉద్యోగుల బదిలీలు వాయిదా వేయాలి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 27: ఉద్యోగుల బదిలీలు వాయిదా వేయాలని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. నగరంలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయం ముందు మంగళవారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దశరథ రఘురామిరెడ్డి, కార్యదర్శి అబ్దుల్ సాహెబ్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా జరిగిన ఉద్యోగుల బదిలీలను రద్దు చేస్తూ, సదరు సిబ్బందిని వారి సొంత యూనిట్ ఆఫ్ అపాయింట్‌మెంట్ స్థానాలకు బదిలీలు చేసి, తిరిగి సర్కిల్ వ్యవస్థను పూర్వపు స్థితికి తీసుకురావాలని కోరారు. జీఎస్‌టీఓలకు సరైన వర్క్ ఫంక్షన్స్ ఏర్పాటు చేయాలని, రీజనల్ ఆఫీసులు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, డి.చంద్రశేఖర్, పి. రమేష్‌బాబు, పాణిగ్రాహి, రాష్ట్ర ఈసీ సభ్యుడు సిద్దిక్, మహిళా కార్యవర్గ సభ్యులు టి. మహాలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు

ఘనంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు

కోడుమూరు(రూరల్), ఆగస్టు 27: మండలంలోని కొత్తపల్లి, అమడగుంట్ల గ్రామాల్లో శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు జరిగింది. ఇందులో భాగంగా అమడగుంట్ల శ్రీకృష్ణ ఆలయంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని ఎద్దులబండిపై ఉంచి వీధులగుండా గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే బాలికలకు కుర్చీలాట, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కొత్తపల్లిలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి మేళతాళాల మధ్య వీధుల్లో ఊరేగించారు. టీడీపీ నాయకులు తిరుమలనాయుడు, అంజనేయులు, వెంకటరాముడు, నాయుడు, మద్దిలేటి, సంగమేశ్వరయ్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు భావన్న, శివక్రిష్ణ, విశ్వనాథ్, డ్రైవర్ రాముడు, బాలరాజు పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలో శ్రీకృష్ణాష్టమిని వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీకృష్ణుని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే బాలికలకు తాడు ఆట, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు జిల్లా టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి నాగప్ప యాదవ్, యాదవ సంఘం పెద్దలు బహుమతులు అందజేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.



కొత్తపల్లిలో శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

మంకీ ఫాక్స్‌తో అప్రమత్తంగా ఉండాలి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 27: మంకీ ఫాక్స్‌తో అప్రమత్తంగా ఉండాలని పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం సూపరింటెండెంట్ చాంబరులో మంకి ఫాక్స్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో మంకీ పాక్స్ కేసులు పెరుగుతుండటంతో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. పెద్దాసుపత్రిలో ఆరు పడకలతో అత్యాధునిక వైద్యసేవలతో మంకి ఫాక్స్ వార్డును ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రిలో స్పెషలిస్టు వైద్యుల బృందం, నోడల్ అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నోడల్ అధికారులుగా మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ ఇక్బాల్ హుసేన్, చర్మవ్యాధుల విభాగం హెచ్‌వోడీ డాక్టర్ పి.పద్మజ, పల్మనాలజి ప్రొఫెసర్ ఏఎస్ శ్రీకాంత్, మైక్రో బయాలజి ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ ఏ.రేణుకాదేవి, మెడిసిన్ ప్రొఫెసర్ ఎం.అబ్దుల్ రహీమ్‌లను నియమించారు.

శౌర్య హోండా నాలుగో వార్షికోత్సవం



ఎమ్మెల్యే గౌరు చరితను సత్కరిస్తున్న డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కైప పద్మాలతారెడ్డి, విశ్వమోహన్‌రెడ్డి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 27: సి.క్యాంపులోని శౌర్య హోండా షోరూమ్ నాలుగో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజర య్యారు. గడిచిన ఏడాదిలో షోరూమ్‌లో సర్వీసు, సేల్స్, స్పేర్‌పార్ట్స్, సేఫ్టీ విభాగాల్లో ప్రతిభ చూపిన ఎగ్జిక్యూటివ్స్‌కు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ రానున్న సంవత్సరంలో షోరూమ్ మరింత అత్యున్నత స్థాయికి చేరాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, 17వ వార్డు కార్పొరేటర్ కైప పద్మలతారెడ్డి, షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.విశ్వమోహన్‌రెడ్డి, షోరూమ్‌లోని వివిధ విభాగాధిపతులు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

జాబు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

సి.బెళగల్, ఆగస్టు 27: ఉపాధి కూలీలు జాబు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో లక్ష్మన్న తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సిబ్బందితో మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో జాబు కార్డులు లేనివారు వేరే వారి పేరుపై ఉపాధి పనులకు హాజరవుతున్నారన్నారు. అలాంటి వారు గ్రామాల్లోని టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లను సంప్రదించి జాబు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 27: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్ శర్మ అన్నారు. మంగళవారం స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అంతర్ పాఠశాలలకు కబడ్డీ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడలతో విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లవరం రామాంజనేయులు, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి చిన్న సుంకన్న పాల్గొన్నారు.

'ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి'

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 27: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలిత డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయాలని కోరుతూ కర్నూలు అర్బన్ ఒకటో సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ అంగన్‌వాడీల కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, యూనియన్ జిల్లా కార్యదర్శి చౌడేశ్వరి, పార్వతి, జయశ్రీ పాల్గొన్నారు.

● విజయవాడలో ఈనెల 28న జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈసమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన భూ కుంభకోణాలపైన, పేద భూములు ఆక్రమణలపైన చర్చ ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా భూ బాధితులు సదస్సుకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి వర్క్‌షాపును జయప్రదం చేయండి: విజయవాడలో సెప్టెంబరు 2,3,4 తేదీల్లో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర స్థాయి వర్క్‌షాపును జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కారుమంచి మాట్లాడుతూ పాలకులు నిరుద్యోగులను మోసం చేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిం చడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. బీజేపీ అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్తూ ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నగర అధ్యక్షుడు బాబయ్య, నాయకులు చంటి, ఖాసిం, సయ్యద్, శివ పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

మినరల్ వాటర్ ప్లాంటు పునఃప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఓర్వకల్లు, ఆగస్టు 27: ఓర్వకల్లులో మినరల్ వాటర్ ప్లాంటు నిరుపయోగంగా మారిందని ఆంధ్రజ్యోతిలో ఈనెల 20న ప్రచురితమైంది. దీనిపై ఎమ్మెల్యే గౌరు చరిత స్పందించారు. మినరల్ వాటర్ ప్లాంటును ఎందుకు నిలిచివేశారని, ఏ కారణంతో తెరవలేదని అధికారులతో ఆమె ఆరా తీశారు. స్పందించిన నాయకులు, అధికారులు మంగళవారం మినరల్ వాటర్ ప్లాంటును పునఃప్రారంభించారు. 2011లో ఓర్వకల్లు గ్రామస్థులకు సురక్షితమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో వీఎస్‌టీ కంపెనీ వారు మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీకి కేటాయించారు. అయితే.. గత నెలలుగా వాటర్ ప్లాంటు ప్రైవేటు వ్యక్తికి అప్పగించారు. వాటర్ ప్లాంటు మూసి ఉండటంతో ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, నాయకులు చొరవ తీసుకుని నీటిని విడుదల చేశారు. టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, రామభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

మెనూ పాటించకపోతే చర్యలు: ఎంఈవో

సి.బెళగల్, ఆగస్టు 27: మధ్యాహ్న భోజనం మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని మండల విద్యాధికారి ఆదాంబాషా వంట ఏజెన్సీలను హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కోట స్కూల్, ఉన్నత పాఠశాలలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించని వంట ఏజెన్సీలను రద్దు చేస్తామని హెచ్చరించారు. బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండేలా చూడాల న్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు ఉన్నారు.

మెడికల్ కాలేజీలో చేరిన ఎంబీబీఎస్ విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 27: కర్నూలు మెడికల్ కాలేజీలో 2024-25 విద్యా సంవత్సరానికి కొత్తగా ఎంబీబీఎస్ విద్యార్థుల చేరిక మొద లైంది. మంగళవారం తొలిరోజు ఆల్ ఇండియా కోటా కింద ఐదుగురు ఎంబీబీఎస్ విద్యార్థులు అడ్మిషన్ అయ్యారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.హరి చరణ్ కొత్త విద్యార్థులను చేర్పించుకున్నారు. నిబంధనల ప్రకారం నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణతలో 15 శాతం ఆల్ ఇండియా కోటాగా నిర్ణయించగా.. 250 సీట్లలో అందులో 37 సీట్లు కర్నూలు మెడికల్ కాలేజీలో సదురు కోటా కింద కేటాయించారు.

మున్సిపల్ సిబ్బందికి అభినందన

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 27: నగరంలోని 23వ వార్డు శ్రీరామ్‌నగర్ క్వార్టర్స్‌లో దొంగను పట్టించిన మున్సిపల్ సిబ్బందిని మేయర్ బీవై.రామయ్య అభినందించారు. మంగళవారం నగర కార్యాలయంలో శానిటేషన్ సెక్రటరీ ఏంజల్ ప్రణీత, మేస్త్రీ సురేష్, కార్మికురాలు శిరీషలను మేయర్ సత్కరించారు. ఈ నెల 22న శ్రీరామ్‌నగర్ క్వార్టర్స్‌లో ఒంటరిగా నివాసముంటున్న ఓ మహిళ ఇంట్లోకి చొరబడి సెల్ ఫోన్ తస్కరించి పారిపోతుండగా, మున్సిపల్ సిబ్బంది వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సెపక్‌తక్రాకు శివకుమార్ ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 27: థాయిలాండ్ దేశంలోని బ్యాంకాక్‌లో జరగనున్న అంతర్జాతీయ కింగ్స్ కప్ సెపక్‌తక్రా పోటీలకు కర్నూలు జిల్లాకు చెందిన సి.శివకుమార్ ఎంపికయ్యారని రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి 8వ తేదీ వరకు బ్యాంకాక్‌లో జరగనున్న కింగ్స్ కప్ సెపక్‌తక్రా పోటీల్లో భారత జట్టుకు ఆయన ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయండి

కోడుమూరు (రూరల్), ఆగస్టు 27: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని ప్యాలకుర్తిలో ఇళ్ల నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ లేఅవుట్‌లో మంజూరైన ఇళ్లు, పూర్తయిన సంఖ్య, వివిధ దశల్లో ఉన్న ఇళ్ల పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట హౌసింగ్ డీఈ వాసుదేవరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ అఫ్రోజ్ ఉన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

ఓర్వకల్లు, ఆగస్టు 27: బడిఈడు పిల్లలు ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ స్కూల్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంటు ఎగ్జామ్ అధికారి చంద్రభూషణ్ తెలిపారు. మంగళవారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవోఎస్ఎస్ పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లపై ప్రధానోపాధ్యాయులతో, అంగన్‌వాడీ వర్కర్లతో ఆయన సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రభూషణ్, ఎంఈవో ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు పైబడిన బాలబాలికలంతా ఓపెన్ స్కూల్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రేపటి నుంచి సత్యసాయి కళాక్షేత్రం వేడుకలు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 27: నెహ్రూనగర్‌లోని సత్యసాయి బాబా మందిరం ఆవరణలో నూతనంగా నిర్మించిన సత్యసాయి కళాక్షేత్రం ప్రారం భోత్సవ వేడుకలు గురువారం, శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి, మందిరం కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, మాజీ అధ్యక్షుడు సాయిబాబా తెలిపారు. మంగళవారం కళాక్షేత్రం ప్రారంభ వివరాలు తెలిపే బ్రోచర్లను వారు ఇతర ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. శుక్రవారం సత్యసాయి కళాక్షేత్రం ప్రారంభోత్సవం ఉంటుందని, ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, టీజీ రాజ్యలక్ష్మి దంపతులు హాజరై కళాక్షేత్రం ప్రారంభిస్తారని తెలిపారు.

పుస్తకాల భారాన్ని తగ్గించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 27: విద్యార్థులకు పుస్తకాల భారాన్ని తగ్గించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. మంగళవారం 48వ వార్డు రోజావీధిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

సి.బెళగల్, ఆగస్టు 27: గర్భిణులు రక్తహీనత లోపించకుండా ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సి.బెళగల్ పీహెచ్‌సీ వైద్యాధికారి మిథున్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌ను కలిసిన తెలుగునాడు ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 27: కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డిని మంగళవారం సాయంత్రం కలిసారు. ఈ సందర్భంగా యూని యన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు, జిల్లా అధ్యక్షుడు మాధవరాజు, జిల్లా కార్యదర్శి బంగారి మాట్లాడుతూ ఆసుపత్రిలో సమస్యలు, నర్సు లకు ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్, ఉద్యోగులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కోశాధికారి శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శాంతిలత, ఎం.నాగలక్ష్మి, మధుసూదన్, సుబ్బయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

వీరమహిళల పూజలు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 27: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా మంగళవారం రాజ్ విహార్ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జనసేన వీర మహిళలు అమ్మవారికి పవన్ కల్యాణ్ పేరుపై అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేపట్టారు. సీహెచ్ బ్రాహ్మణి, విజయ, కనకదుర్గ, సరస్వతి, శ్రీలక్ష్మి, పుష్పలత పాల్గొన్నారు.

'ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి'

ఓర్వకల్లు, ఆగస్టు 27: రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే ప్రభు త్వమే ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఉయ్యాలవాడ, బుక్కాపురం గ్రామాల ఆటో యూనియన్ కార్మికులతో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమం టీడీపీ మండల కార్యదర్శి షాజహాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులతో లక్షలాది రూపాయల ట్యాక్స్ రూపాల్లో ఆదాయం ఉన్నా ఏ మాత్రం వారి సంక్షేమం పట్టించుకోవడంలేదన్నారు. అనంతరం బుక్కాపురంలో ఆటో యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రాముడు, రామకృష్ణ, సంజన్న, గిరిబాబు, నరేష్, పుల్లయ్య, పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై సర్వే నిర్వహించాలి

కోడుమూరు, ఆగస్టు 27: పంట కోత ప్రయోగాలపై సర్వే నిర్వహించాలని మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్ పంటలకు సంబంధించిన కోత ప్రయోగాలు చేపట్టడానికి సర్వే నెంబర్ల వివరాలు క్షేత్రస్థాయిలో విస్తరణాధికారులు గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో స్టాటికల్ ఆఫీసర్ రఘువీర్ ఏఈఓలు బాలకృష్ణ, తస్లీము పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే లైసెన్సు రద్దు

ఎరువులు, రసాయనిక వస్తువులను రైతులకు అధిక ధరలకు విక్రస్తే లైసెన్సును రద్దు చేస్తానని వ్యవసాయ అధికారి రవిప్రకాష్ డీలర్లను హెచ్చరించారు. కోడుమూరు పట్టణంలోని లక్ష్మీ ఫెర్టిలైజర్స్, గణేష్ ఆగ్రో ఎంటర్‌ప్రైజెస్ దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు.

తడబడి


బినిగేర పాఠశాల వద్ద బురద రోడ్డులో వెళుతున్న చిన్నారులు

ఆస్పరి, ఆగస్టు 27: మండలంలోని బినిగేర ప్రాథమిక పాఠశాల వద్ద రహదారి దుస్థితి ఇది. బడిలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 130 మంది విద్యార్థులు చదువుతున్నారు. రహదారి బురదమయంగా ఉండటంతో చిన్నారులు ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదం చోటుచేసుకుంటుంది. పంచాయతీ అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జనరల్ బోగీలను పెంచాలి


వినతిపత్రం ఇస్తున్న కునిగిరి నీలకంఠ

ఆదోని టౌన్, ఆగస్టు 27: ప్రయాణికుల సౌకర్యార్థం జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ కోరారు. మంగళవారం గుంతకల్ డివిజన్ రైల్వే మేనేజర్ విజయ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. పేదలు దూర ప్రాంతాలకు జనరల్ బోగీల్లో వెళుతుంటారని అయితే అవి నామమాత్రంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మద్దికెర స్టేషన్‌లో అన్ని రైళ్లను ఆపేలా చూడాలని ఆయన కోరారు.

కంది, మినుము సాగు చేయాలి : ఏవో

మద్దికెర, ఆగస్టు 27: ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా రైతులు కంది, మినుము పంటలను సాగు చేసుకోవాలని ఏవో ఉప్పర రవి సూచించారు. మంగళవారం మద్దికెర, ఎడవలి గ్రామాల్లో పంటలను పరిశీలించారు. పత్తిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని పత్తిని సెప్టెంబరు 15వ తేదీలోపు ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. అధికవర్షాల నేపథ్యంలో తెగుళ్లు సోకకుండా వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలని ఏవో కోరారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రెవరెండ్ అద్భుత్ కుమార్

ఆలూరు, ఆగస్టు 27 : సేవా కార్యక్రమాలు అభినందనీయమని గుత్తి బైబిల్ మిషన్ పాస్టర్ రెవరెండ్ అద్భుత్ కుమార్ అన్నారు. ఎం.కొట్టాల గ్రామంలో మంగళవారం అగాపే మిషన్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయనకు క్రైస్తవులు, సీఎస్ఐ సంఘ పెద్దలు స్వాగతం పలికారు.. పాస్టర్ సత్యనందం, జోయల్, సంఘ పెద్దలు దేవపుత్ర, ఆశీర్వాదం, దానప్ప, ఆనంద్, అగ్రహారం ఆనంద్, రాజు, విక్రమ్ బాబు, యూత్ సభ్యులు ప్రసాద్, బెన్ని, రాజు, కిమ్స్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

ఏకీకృత పెన్షన్‌తో ఉద్యోగులకు తీవ్ర నష్టం

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 27: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏకీకృత పెన్షన్ పథకంతో ఉద్యోగులకు తీవ్ర నష్టమదని, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం నెహ్రూ ఉన్నత పాఠశాలలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. దీన్ని తాము తిరస్కరిస్తున్నామని అన్నారు. పాత పెన్షన్ కోసం పోరాడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ అంటూ మభ్యపెడుతున్నాయని అభ్యంతరం తెలిపారు. లోక్యానాయక్, భీమరాజు, రవి, వీరచంద్ర యాదవ్, రాజా సతీష్, ప్రసాదు, విజయ్, ఉరుకుందప్ప, ప్రహ్లాద, నగేష్, సుధాకర్ బాబు, వెంకటరామిరెడ్డి, శ్రీరాములు, మారయ్య పాల్గొన్నారు.

రైతులు దిగుబడులను ఆరబెట్టుకొని రావాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 27: మార్కెట్ యార్డ్‌కు తీసుకువచ్చే మునుపే రైతులు ఆరబెట్టుకుని తీసుకురావాలని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి కోరారు. మంగళవారం మాట్లాడుతూ పత్తి, వేరుశనగ గ్రేడింగ్ చేసుకునివస్తే మంచి ధర వస్తుందని అన్నారు.

కలుగొట్లలో సీసీ రోడ్లు నిర్మించాలి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 27: మండలంలోని కలుగొట్ల గ్రామంలో సీసీ రోడ్లను నిర్మించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సత్యన్న, ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రోడ్లు లేకపోవడంతో బురదతో పారిశుధ్యం లోపించిందని చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీవో బంగారమ్మకు వినతిపత్రం అందజేశారు. బాబు, నరసింహులు, రాముడు, అంజినయ్య, వీరేష్, సుంకన్న, రాజు, యేసేపు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

కోసిగి, ఆగస్టు 27: స్థానిక మూడో వార్డుకు చెందిన విద్యుత్ సరఫరాను నిలిపివేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పందికోన రాజేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వం 200 యూనిట్లు ఉచితంగా ఇస్తుందని విద్యుత్ ఏఈ వీరేష్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై పోలీసులకు పిర్యాదు చేసినట్లు రాజేష్ తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'

ఆలూరు, ఆగస్టు 27: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది అన్నారు. మంగళవారం మాట్లాడుతూ ఆర్టికల్ 341 సుప్రీంకోర్టు తీర్పు రాజకీయ లబ్ధికి ఉద్దేశించి బీజేపీ ప్రభుత్వం దళితులను అణగదొక్కడానికేనని ఆరోపించారు. మాలల బంద్‌ను ప్రభుత్వం అణచివేసిందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు పోరాడాలని పిలుపునిచ్చారు, బొజ్జప్ప, నగరూరు చంద్ర పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయండి

● అధికారులు, కమిటీ సమావేశంలో సబ్ కలెక్టర్


మాట్లాడుతూన్న సబ్ కలెక్టర్ చల్లా విశ్వనాథ్

ఆదోని, ఆగస్టు 27: 'గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదోని ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ చల్లా విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 7న వినాయక చవితి సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. 11న నిమజ్జనం లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, ఇబ్బందులు రాకూడదన్నారు. రహదారుల గుంతలను పూడ్చాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీసీర దీప్తి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంట సుబ్బారావు, డీటీ రుద్రగౌడ్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు విఫలం


రోడ్లను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నందవరం, ఆగస్టు 27: వైసీపీ నాయకుల వైఫల్యంతోనే గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించలేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడు ఆరోపించారు. మంగళవారం ఆయన నందవరంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను పట్టించుకోలేదని అన్నారు. మండల కార్యదర్శి గిడ్డయ్య, శాంతప్ప, ముని, బంగారి, చిన్నరాముడు, మల్లేష్, రామలింగడు, ఐకొండ, బీమన్న పాల్గొన్నారు.

మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలి

ఆదోని టౌన్, ఆగస్టు 27 : పట్టణంలో మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అసోసియేషన్ కన్వీనర్ ఆదినారాయణ డిమాండ్ చేశారు. మంగళరవారం మాట్లాడుతూ, పారి శ్రామికంగా రెండో ముంబయిగా పేరు పొందిన ఆదోనిలో భారీ పరిశ్రమలు మూతపడి కార్మికులకు ఉపాధి దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోనిలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.

ఇసుక లారీ బోల్తా..


బోల్తాపడిన లారీ

తుగ్గలి, ఆగస్టు 27: డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతో లారీ ఆగి వున్న ఎద్దుల బండీని ఢీ కొట్టి మంగళవారం బోల్తా పడింది. వివరాల మేరకు.. జొన్నగిరి శివారు మలుపు వద్ద పత్తికొండ నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఎద్దుల బండీని ఢీ కొట్టడంతో బోల్తా పడగా, ఎద్దుల బండీ నుజ్జునుజ్జయింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటం వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. జొన్నగిరి ఏఎస్ఐ రంగస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పెద్దమ్మవ్వ ఆలయ వార్షికోత్సవం

పత్తికొండ టౌన్, ఆగస్టు 27: పట్టణంలో ఉప్పర కట్ట పెద్దమ్మవ్వ ఆలయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పంచామృతా భిషేకం అర్చకులు ప్రసాద్ స్వామి నిర్వహించారు. శ్రావణమాసంలో జరిగే అమ్మవారి వార్షికోత్సవ వేడుకలకు భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని అర్చకులు తెలిపారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

దళితుల సమస్యలు పరిష్కరించండి

మంత్రాలయం, ఆగస్టు 27: నియోజకవర్గంలో దళితుల సమస్యలను పరిష్కరించాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జిక్కిం జానయ్య డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ రవి, ఎంపీడీవో మణిమంజరి, హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్యను కలిసి దళితుల సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో అధికంగా ఉన్న దళిత, గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి గర్జి హనుమన్న, రత్నం, అనిల్ కుమార్, నాగేంద్ర, గోపాల్, నరసింహులు, ప్రకాష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతో జాగ్రత్త తీసుకోవాలి

గోనెగండ్ల, ఆగస్టు 27: అధిక వర్షాలతో పంటలు దెబ్బతినకుండా రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత కోరారు. మంగళవారం గ్రామాల్లో పంటలను సందర్శించారు. పత్తి నీటమునిగితే కాయరాలి, ఆకులు ఎర్రబడతాయని అన్నారు. ఇందుకు ఎండగా ఉన్న సమయంలో పోటీషియం నైట్రేట్ 5గ్రాముల ను ఒకలీటర్ నీటిలో వారంలో మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కంది ముంపుకు గురయితే పొటాషియం నైట్రేట్ 5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వేరుశనగలో తిక్క ఆకుమచ్చ తెగులు సోకిందని నివారణకు హెగ్జాకోనజోల్ 1 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

ఎమ్మెల్యే బీవీపై ఆరోపణలు సహించం

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 27: ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదని టీడీపీ కురువ సాధికారిక కమిటీ మెంబర్ కె.టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవార మాట్లాడుతూ నియోజకవర్గాన్ని బీవీ కుటుంబం ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కొంతమంది వైసీపీ అజెండాను అమలుకు ప్రయత్నిస్తే భంగపాటు తప్పదన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి ఉపయోగపడే కథనాలు రాయాలని హితవు పలికారు.

శివారు కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి

● మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా.. కమిషనర్‌కు వినతిపత్రం


కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 27: పట్టణంలోని శివారు కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఐ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పురపాలక కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పట్టణ కార్యదర్శి రంగన్న, భాస్కర్, ఈరమ్మ మాట్లాడుతూ ప్రజలు పన్నులు చెల్లిస్తున్నా సదుపాయాలు కల్పించడంలో మునిసిపల్ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. పట్టణాభివృద్ధి మొక్కలు నాటడం, రంగులు వేయడం కాదన్నారు. శివారు కాలనీలు సంజీవి నగర్, రాఘవేంద్ర కాలనీ, లక్ష్మీపేట, మిలిటరి కాలనీ, శివన్న నగర్, మైనారిటీ కాలనీ, చంద్రయ్య కొట్టా ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ లేవని తాగునీటి పైపు లైన్లు విద్యుత్ స్తంభాలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వర్షం వస్తే కాలనీలు జలమయం అవుతున్నా యని పట్టణం ఎక్కడ అభివృద్ధి చెందిందని నిలదీశారు. అనంతరం కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందించారు. షమీవుల్లా, ఇస్మాయిల్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, మత్స్యకారుల మధ్య వివాదం


మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారులు

మద్దికెర, ఆగస్టు 27: చెరువులు, కుంటల్లో చేపలు వదలడానికి డబ్బులు కట్టాల్సిందేనని అధికారులు అంటుండగా తమకు నిబంధనల మేరకు హక్కు ఉందని డబ్బులు కట్టమని మత్స్యకారులు అనడంతో వివాదం చోటు చేసుకుంది. మద్దికెర పంచాయితీ కార్యాలయంలో జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి చంద్రయ్య, సహాయాదికారి వసంత, పంచాయితీ కార్యదర్శి శివకుమార్ అధ్యక్షతన మద్ది, బెస్త కులస్థుల సమావేశం నిర్వహించారు. మద్దమ్మ కుంటలోకి చేపలు పెంచడానికి రూ.75 వేలు అడుగుతున్నారనీ, అయితే.. ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.25వేలు మాత్రమే ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నాటి ఉప ముఖ్యమంత్రి కేఈ చేపల పెంచుకోవడానికి ఉచితంగా అవకాశం కల్పించారన్నారు. జిల్లా జేసీ దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. పంచాయతీ సభ్యులు లక్ష్మీనారాయణ, కవిరెడ్డి కృష్ణ, రామాంజులు, కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

మొలగవల్లిలో వైభవంగా రథోత్సవం


మొలగవల్లిలో పూజలు చేస్తున్న టీడీపీ నాయకుడు వీరభద్రగౌడ్

ఆలూరు రూరల్, ఆగస్టు 27: మొలగవల్లిలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించారు. కృష్ణుడి ఆలయంలో గోపూజ, పంచామృతాభిషేకం, కుంకుమ అర్చన, మహామంగళ హారతి వంటి విశేష పూజలు చేశారు. టీడీపీ నాయకులు వీరభద్రగౌడ్, వైకుంఠం జ్యోతి వేరు వేరుగా పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం వేలాది మంది భక్తుల నడుమ శ్రీ కృష్ణుడి రథోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. సర్పంచి మోహన్ రాజ్, శివస్వామి, మండల కన్వీనర్ అశోక్ యాదవ్, అంజనేయ, బెలగంటి హనుమప్ప, కటారు కొండ శీనప్ప, ఐకాంత్ కురవ రామంజినేయులు. మాజీ యంపీపీ రామనాథ్ యాదవ్, బీజేపీ నాయకులు వెంకట రాముడు, రంగస్వామి, కొనకొండ్ల సోమన్న, మాణిక్య రెడ్డి, వెంకటేశ్వరులు, ఈరప్ప, యంకన్న, జలంధర్, పాల్గొన్నారు.

మద్దికెర: స్థానిక మద్దమ్మ కుంట కృష్ణుని ఆలయంలో విద్యా సాయి కళాశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. మధ్యాహ్నం కృష్ణుని, గోపికల వేషాధారణ చిన్నారులతో ఉట్టి కొట్టించారు. సాయంత్రం ఊరేగింపు అనంరతం రాత్రి భజన ఏర్పాటు చేశారు.

కోసిగిలో ఉచిత వైద్య శిబిరం

కోసిగి, ఆగస్టు 27: ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం శుభ పరిణామమని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. మౌంట్ కార్నెల్ హై స్కూల్‌లో ఆర్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కోసిగిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఫాదర్స్ జోజి, బాలయేసు నేతృత్వంలో ఆర్ఆర్ హాస్పిటల్ డాక్టర్లు రోగులను పరీక్షించారు. ఎంపీపీ ఈరన్న, డాక్టర్లు రోహిత్, రాహుల్, రాఘవేంద్రరావు, మండల ఇన్‌చార్జి మురళిరెడ్డి, నరసింహులు, బెట్టన్నగౌడు, మహంతేష్ స్వామి, నాగరాజు, వెంకటేశ్, మంగమ్మ ఉన్నారు.

పంటకోతపై అవగాహన పెంచుకోవాలి

ఆలూరు రూరల్, ఆగస్టు 27: రైతులు పంట కోత ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలని ఏడీఏ సునీత్ సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంట కోత ప్రయోగాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, పంట కోత ప్రయోగాలపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో కొర్రలు, ఉలవలు, పెసర విత్తనాలు ఇస్తోందని చెప్పారు. ఈ క్రాప్ నమోదును రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఓలు వెంకటేశ్వర్ గౌడ్, దేవభూషణ కుమార్, నరేంద్ర కుమార్, సుజాత పాల్గొన్నారు

పేలిన ట్రాన్స్‌ఫార్మర్


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు

పత్తికొండ, ఆగస్టు 27: పట్టణంలోని టీచర్స్ కాలనీలో రహదారి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం సాయంత్రం పేలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆయిల్ చిమ్మి మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న విద్యుత్ ఉద్యోగి ధైర్యం చేసి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అగ్నిమాపక అధికారి దినకర్‌బాబు సిబ్బందితో చేరుకునే సమయానికి మంటలు నిలిచి పోయాయి. ట్రాన్స్‌కో ఏఈ రవీంద్రనాయక్ ట్రాన్స్‌ఫార్మర్‌ను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. అధిక లోడ్ కారణంగానే ట్రాన్స్‌ఫార్మర్ పేలి ఉంటుందని లోడ్‌పెంచేందుకు ఏఈ తెలిపారు.

తప్పిన ప్రమాదం..

ఈ రహదారిలోనే నిత్యం పాఠశాలకు విద్యార్థులు వెళ్లి వస్తుంటారు. ఆ సమయంలో పేలి ఉంటే పెద్ద ప్రమాదం సంభవించేదని స్థానికులు అన్నారు. మరోసారి ప్రమాదం చోటుచేసుకోకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బెంగళూరులో వలస కూలీ మృతి


అంజి(ఫైల్)

కౌతాళం, ఆగస్టు 27: మండలంలోని గుడికంబాళి గ్రామానికి చెందిన పొట్టకూటి కోసం బెంగుళూరుకు వెళ్లిన వలస కూలీ మంగళవారం మృతిచెందాడు. వివరాల మేరకు.. వడ్డే బజ్జమ్మ, నగేష్‌కు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. గ్రామంలో పనులు లేకపోవడంతో అందరూ బెంగుళూ రుకు వెళ్లారు. చిన్న కుమారుడు వడ్డే అంజి(21) పట్టణంలో బేల్దార్ పనులు చేస్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో

గోనెగండ్ల, ఆగస్టు 27: ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణదారులు ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు రైతులకు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత హెచ్చరించారు. మంగళవారం తిప్పనూరు, వేముగోడు, పుట్టపాశం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. సెప్టెంబరు 15వ తేదీ లోపు రైతులంతా పంట నమోదు ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. పంట నమోదు చేయించుకుంటే నష్టపరిహారం, బీమా వస్తుందని తెలిపారు. వేముగోడు గ్రామంలోని వైష్ణవి ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రైతులకు తప్పక బిల్లులు ఇవ్వాలన్నారు. ప్రతి రోజు స్టాక్ వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. సిబ్బంది సత్తార్, లక్ష్మన్న, జాకీర్, పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు విడుదల

గోనెగండ్ల, ఆగస్టు 27: గోనెగండ్ల మండలంలోని గ్రామాలకు 15 వ ఆర్థికసంఘం నిధులు విడుదల అయినట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గోనెగండ్ల మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు గాను రూ. 90లక్షల 12వేల 211 విడుదల అయ్యాయి. ఈ నిధులతో తాగునీటి పథకాలకు, పారిశుధ్య పనులకు ఉపయోగించాలని పంచాయతీ సిబ్బందికి గ్రామ సర్పంచ్‌లకు ఎంపీడీవో సూచించారు.

ఎస్ఎంసీ అధ్యక్షుడిగా లక్ష్మన్న

కౌతాళం, ఆగస్టు 27: మండలంలోని తోవి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు మంగళవారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో తెలుగుదేశం మద్దతుదారుడు లక్ష్మన్న విజయం సాధించారు. ఉదయం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ట్లు వేయగా వైసీపీ బలపరిచిన అభ్యర్థిపై 34 ఓట్లతో విజయం సాధించినట్లు ఎంఈఓ-2 శోభారాణి తెలిపారు. ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ మల్లికార్జున స్వామి, ఎంపీడీఓ సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం

మద్దికెర, ఆగస్టు 27: గ్రామంలో పంచాయతీ స్థలాల ఆక్రమణలను తొలగిస్తామని అధికారులు తెలిపారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు మంగళవారం పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సలహాదారుడు బండారు ఆంజనేయులు ఆక్రమణలను పరిశీలించారు. రామాంజులు, మల్లికార్జున, చంద్రహరి పాల్గొన్నారు.